# సమత్వము భారతీయ సంస్కృతి

ప్రేమస్వరూపులారా!

గర్వముండినంతవరకు మానవుని ఎవరూ ప్రేమించరు. ఏనాడు మానవుడు గర్వమును అణగద్రొక్కునో అప్పుడే అట్టి మానవుని సర్వులు ప్రేమిస్తారు. క్రోధమున్నవానికి సుఖము ఉండదు. నిరంతరము శోకించుచుండును. ఎప్పుడు ఈ క్రోధమును అణగద్రొక్కునో అప్పుడే అతనికి ఒక విధమైన ఆనందము ప్రాప్తిస్తుంది. మితిమీరిన కోరికలుండినంతవరకు ఎట్టి సంపదలు చేకూరవు. ఎప్పుడు మానవుడు తన కోరికలు అదుపులో నుంచుకొనునో అప్పుడే సర్వులు అతనిని ప్రేమిస్తారు. లోభముండినంతవరకు మానవునికి ఎట్టి సుఖము ప్రాప్తించదు. ఏనాడు లోభము దూరము గావించుకొనునో ఆనాడే ఈ మానవునికి సుఖము ప్రాప్తిస్తుంది.

**మానవ జీవితము సుఖదుఃఖముల సమ్మిళిత స్వరూపమే**

ప్రేమస్వరూపులారా! భగవద్విషయము అగమ్యగోచరమైనది. భగవద్విషయమై విమర్శించుట అతి సులభము. భగవత్ లీలలుగానీ, భగవత్ శక్తులుగానీ విమర్శించుట అత్యంత సులభము. కానీ అవగాహన చేసుకోటం మహాకష్టము. చెడ్డను గురించి కాకులవలె కేకలు వేయటము మంచిదికాదు. మంచిని గురించి కోకిలవలె గానం చేయటం చాలా మంచిది. 'ముండే ముండే మతిర్ భిన్నః'. 'బుద్ధిః కర్మానుసారిణీ'. ఒకరి అభిరుచి ఒకరికి అయిష్టంగా ఉంటుంది. ఒకరి యిష్టము మరొకరికి చెడ్డగా ఉంటుంది. ఇట్టి మానవత్వముతో ఉండిన ఈ జీవితము దైవత్వమును ఏరీతిగా గుర్తించటానికి ప్రయత్నించగలదు? ప్రాచీనకాలమునుండి భారతీయ ఋషులు అనేక విధములైన పరిశోధనలు, పరిశీలనలు సల్పి వేద శాస్త్ర ఇతిహాస పురాణములద్వారా దివ్యత్వమును జగత్తుకు ప్రచార, ప్రబోధలు చేయుచూ వస్తున్నారు. ఉపనిషత్తు 'రసోవైసః' అంది. అనగా

sri sathyasai vachanamrutam

పానకమునందు పంచదారవలె, పాలయందు వెన్నవలె భగవంతుడు సర్వత్ర నిండి ఉన్నాడని ఉపనిషత్తుల ప్రబోధ. భగవంతుడు మంచియందు, చెడ్డయందుకూడా ఉంటున్నాడు. సత్యాసత్యములందుకూడా భగవంతుడు ఉంటున్నాడు. పాపపుణ్యములందు భగవంతుడు ఉంటున్నాడు. ఇట్టి పరిస్థితియందు అసత్యమనిగానీ లేక అధర్మమనిగానీ, పాపమనిగానీ ఏ విధంగా నిర్ణయించగలడు? అయితే 'మమాత్మ సర్వ భూతాంతరాత్మ' ఇది భగవద్గీత ప్రబోధ. అన్ని భూతములందు నాయొక్క ఆత్మయే ఉన్నది. ఇట్టి సత్యమును గుర్తించిన వ్యక్తికి సమత్వమనే ఆనందము ప్రాప్తిస్తుంది. కాని భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన జీవితములో జీవించే ప్రతివానికి భిన్నమనే సత్యాసత్యములు, ధర్మాధర్మములు, మంచిచెడ్డలు, పాపపుణ్యములు తప్పినవికావు. కనుక మనము ప్రాకృతమైన జీవితమును గడుపుచున్నంతవరకు ఈ ద్వంద్వసంబంధమైన మార్గములు విడువటానికి వీలుకాదు. ఈ సుఖ దుఃఖముల మధ్యయందే మన శాంతి, భద్రతలు నిలచిఉన్నాయి. మనయొక్క ఆనందములన్నీ దుఃఖముతోనే కూడి ఉంటున్నవి. The pleasure is an interval between two pains. రెండు బాధలమధ్యయందే సుఖము ఉంటున్నది. జీవితమంటే ఏమిటి? జీవితమనగా కేవలము నీడ, ఎండల కలయిక. దుఃఖమే లేక సుఖమును మనము అనుభవించలేము. ఎండనుంచి వచ్చినప్పుడే ఏసియొక్క సుఖము మనకు గుర్తించటానికి వీలవుతుంది. మానవ జీవితము సుఖదుఃఖముల సమ్మిళిత స్వరూపమే! ఇట్టి జీవితమునందు సుఖము ప్రత్యేకముగా ఉండాలని ఆశించుటకు వీలుకాదు. సుఖమునందే సుఖములేదు. 'నసుఖాత్ లభ్యతే సుఖమ్' సుఖమునుండి సుఖమురాదు. దుఃఖమునుండే మనకు సుఖము ప్రాప్తిస్తున్నాది.

**సృష్టి అనగా ఈశ్వర సంకల్పమునకు ప్రతిరూపమే!**

ఈ ప్రపంచమంతయు మూడు విధములైన కర్మలపై ఆధారపడి ఉంటున్నది. ఇది సృష్టి, స్థితి, లయము అని. ఈ మూడింటియొక్క ప్రమాణములు ప్రతి ఒక్కరు అంగీకరించక తప్పదు. ఏ కాలమునందైనా, ఏ దేశమునందైనా, ఏ పరిస్థితులందైనా, నాస్తికుడైనా, యాస్తికుడైనా ఈ మూడు ప్రమాణములను అంగీకరించక తప్పదు. ఇవి ఒక దివ్యమైన

sri sathyasai vachanamrutam

మార్గమును ప్రబోధించినవి. సృష్టి అనేది ఏమిటి? సృష్టి అనగా ఈశ్వర సంకల్పమునకు ప్రతిరూపమే! దీని పేరే ప్రకృతి. ఈ ప్రకృతినుంచి ఆవిర్భవించిన ప్రతి ప్రాణికూడ ప్రకృతి స్వభావములే కలిగి ఉండాలి. ఈ ప్రకృతియొక్క ప్రభావము ప్రచురించే నిమిత్తమై ఈ ప్రపంచములో మూర్తీభవించినవాడే మానవుడు. ప్రకృతియొక్క సంబంధము, ప్రకృతియొక్క ప్రభావము అందరియందు సమానముగా ఉండదు. ఈ ప్రకృతి చైతన్యము దేహభావముతో ఉండినవానికి, అహంకారపరమైనవానికి వికృతంగా ఉంటుంది. ఆత్మ పరమైనవానికి సుకృతమవుతుంది. ప్రకృతి, చైతన్యము ఒక్కటే. వారివారి దృక్పథమును పురస్కరించుకొని, వారి వారి భావములను పురస్కరించుకొని, ఈ మంచి చెడ్డలు అభివృద్ధి అవుతూ ఉంటాయి. ఈ ప్రపంచమునకు 'లోకము' అని ఒక పేరు. లోకమనగా ఏమిటి? ఆలోచనతోకూడిన శక్తికే లోకము అన్నారు. ఈ ప్రదేశములో అనేకమంది ఇప్పుడుంటున్నారు. అందరు ఒకే ప్రదేశములోనే ఉంటున్నారు. కానీ ఒక్కొక్కరి లోకము ఒక్కొక్క రీతిగా ఉంటున్నది. కారణం ఏమిటి? ఒకరు విద్యను గురించి యోచిస్తుంటారు. ఇంకొకరు వ్యాపారమును గురించి ఆలోచిస్తుంటారు. ఇంకొకరు వ్యవసాయమును గురించి ఆలోచిస్తుంటారు. మరికొంతమంది విజ్ఞానమును గురించి విచారణ చేస్తుంటారు. ఈ నైతిక, భౌతిక, ఆధ్యాత్మిక, లౌకికములందు ప్రతి భావముకూడ సంకల్పములయొక్క ప్రభావములే! కనుక, మానవునియందు ఈ సృష్టి, స్థితి, లయములనేవి తన అంతర్భూతమైన శక్తులే! సృష్టి అనగా కేవలము సంకల్పముయొక్క స్వరూపమే! స్థితి అనగా అట్టి స్వరూపమును రక్షించటమే! లయమనగా ఈ రక్షింపబడిన దానిని తనలో చేర్చుకోటమే! ఈ సృష్టి స్థితి లయములకే రజోగుణ, తమోగుణ, సాత్త్వికములని పేరు పెట్టారు. మానవుడు త్రిగుణాత్మక స్వరూపుడు. ఈ త్రిగుణములే త్రిశూలములు. ఈ త్రిశూలములే త్రిమూర్తులు. ఈ త్రిమూర్తులే త్రిలోకములు. కనుక మూడు లోకములు, మూడు మూర్తులుకూడను ప్రతి మానవునియందు మూర్తీభవించియున్నాయి. ఈ ప్రపంచమందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే వారిని రూపములుగా దర్శించినవారు ఎవరులేరు. ఎవరు బ్రహ్మ? ఎవరు విష్ణు? ఎవరు మహేశ్వరుడు? మానవునియందున్న త్రిగుణములే ఈ త్రిమూర్తి స్వరూపములు.

sri sathyasaivachanamrutam

## సృష్టి, స్థితి, లయములకు దైవమే మూలకారణము

**త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.**

ఈ మూడు గుణములను ఏకత్వముగా భావించి శివార్పితము గావించటమే. శివమనగా ఏమిటి? మంగళకరమైన స్థితి. ఈ త్రిమూర్తి తత్త్వమును ఏకత్వము గావించుకున్నప్పుడే మానవత్వములో మంగళత్వము ఏర్పడుతుంది. రాజకీయ రంగములందు అనేక విధమైన శాఖలుంటుంటాయి. ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఆర్థికశాఖ ఉంటాయి. ఇదే విధముగా ఆధ్యాత్మిక మార్గమునందుకూడా అనేక శాఖలుంటున్నాయి. ఇవే సృష్టి, స్థితి, లయములు. సృష్టి డిపార్టుమెంటుకు ఒక నాయకుడు. పోషణ డిపార్టుమెంటుకు ఒకడు నాయకుడు, లయ సంబంధమైన దానికి ఒక నాయకుడు. ఒక్కొక్కరు ఒక్కొక్క డిపార్టుమెంటుకు హెడ్డు మాదిరి ఉంటారు. అయితే వీరు వీరి శాఖలను మాత్రమే సక్రమమైన మార్గములో చూచుకుంటూ రావాలి. ఈ మూడింటి ఏకత్వముచేత అన్నింటికి అధిపతి ఒకడుంటాడు. అతనే ప్రైమినిస్టరు అనుకోండి, ముఖ్యమంత్రి అనుకోండి. అతని పేరే GOD. ఈ మూడింటి చేరికను తన హస్తమునందుంచుకున్నాడు. దీనినే GOD అన్నారు. దీనినే 'అల్లా' అన్నారు. ఈ విధమైన మార్పులను దృష్టిలో ఉంచుకొని దైవమునకు అనేక రూపనామములు కల్పిస్తూవచ్చారు. సృష్టిస్థితిలయములకు దైవత్వమే మూలకారణము. దీనినే ఆంగ్లమునందు GOD అన్నారు. G-Generation, O-Organisation, D-Destruction. ఈ మూడింటి ఏకత్వముచేతనే GOD అన్నారు. ఈ దివ్యత్వమును మానవులు అర్థము చేసుకోలేకపోతున్నారు. ఈ G-Generation అనగా సృష్టి గావించటమే. O-Organisation అనగా రక్షించటము. D-Destruction అనగా తనలో లయము గావించుకోటమే.

## మానవునియందు అనంతమైన శక్తులు ఇమిడియుంటున్నాయి

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు మానవునిలో ఉండిన అంతర్భూతమైన శక్తులే! దీనిని అర్థము చేసుకోవలెనన్న ఆధ్యాత్మిక తత్త్వము అత్యవసరము. ఆధ్యాత్మికమనగా వంటరితనమనిగానీ, ఏకాకి జీవితమనిగానీ కాదు. మానసిక రాగద్వేషములకు దూరముగా

sri sathyasai vahini amrutam

ఉండి యావత్ మానవకోటిని ఏకంగా పరిపూర్ణముగా ఉంచవలెను. ఆ శక్తియే ఆధ్యాత్మికము. ఆధ్యాత్మికము అనగా ఒంటరితనముగా భావిస్తున్నారు. అది చాలా పొరపాటు. ఇట్టి ఆధ్యాత్మిక తత్త్వాన్ని ప్రతి మానవుడు అందర్భూతముగా అర్థము చేసుకోవాలి. మానవునియందు అనంతమైన శక్తులు ఇమిడి ఉంటున్నాయి. మానవునియందులేని శక్తులు ఈ జగత్తులో ఒక్కటికూడా కానరాదు. మనము చూచునది, ఉన్నది, కన్నది ప్రతి ఒక్కటి మనయందున్న దివ్యభావములే, reflection of the inner being. మనయందున్న సర్వశక్తులు ఆవిర్భవింపచేసుకొని మనము అనుభవిస్తున్నాము. ఈ విధమైన తత్త్వము మనము చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఏ విధంగా మనం గుర్తించాలి? భారతీయసంస్కృతి ప్రాచీనకాలమునుండి అనేక మార్గములచేత ప్రచార ప్రబోధలు సల్పుతూవస్తోంది.

**మనస్సును భగవంతునివైపు మరల్చుటమే మంగళకరము**

ఈనాడు మహాశివరాత్రి. నిత్యము ఒకరాత్రి మనము అనుభవిస్తూనే ఉన్నాము. కానీ అవి సామాన్యమైన రాత్రులు. అవి చీకటి రాత్రులు. ఇది శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. ఎట్లా మంగళకరము? మానసిక సంబంధమైన శక్తులకు 16 కళలుంటున్నవి. 'చంద్రమా మనసో జాతః చక్షోస్సూర్యోఅజాయత' అనేక కళలతోకూడినదే మానవత్వము. ఈ 16 కళలలో ఈనాడు మాఘశుద్ధ చతుర్దశిదినము, 15 కళలు లీనమై ఉంటున్నాయి. ఈనాడు అతిసులభముగా మానసిక శక్తిని మనవశము గావించుకోటానికి అత్యంత అవకాశముంటున్నది. దానివలననే దీనికి మంగళకరమైన దినము అన్నారు. మన మనస్సును భగవంతునివైపు మరల్చుటమే మంగళకరము. మానవునియందు శేషింపబడిన పశుత్వము అమితంగా ఉంటున్నాది. ఎవరిని మనము ఏ విధమైన కష్టమునకు గురిచేయకూడదు. సర్వము ఈశ్వరమయమే! 'ఈశావాస్య మిదం జగత్' 'ఈశ్వర స్సర్వభూతానాం' అన్నిభూతములందు ఉన్న చైతన్యశక్తియే ఈశ్వరత్వము. ఎవరిని మనము పూజించినా, ఎవరిని మనము బాధించినా భగవంతునే బాధించినట్టవుతుంది. దీనిని పురస్కరించుకొనే 'పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం' అన్నారు. Help ever,



srisathyasaivachanamrutam

hurt never. ఎవరిని మనం కష్టపెట్టకూడదు. అయితే కొన్ని పరిస్థితులందు మనము కొన్ని విధములైన బాధలకు గురి అవుతాము. అలాంటి పరిస్థితియందు నిత్యానిత్యవిషయ పరిశీలన చేయటానికి కొంతకాలము తీసుకోవాలి. మానవునియందున్న పవిత్ర భావములకే శివత్వమనిపేరు. ప్రతి మానవునియందు ఈ పవిత్రత ఉంటూనే ఉన్నది. పవిత్రతలేని మానవుడు ప్రపంచములో కానరాడు. తాను గుర్తించుకోలేడుకాని ప్రతి ఒక్కరియందుకూడను పవిత్రత ఉన్నది. ఇలాంటి పరిస్థితియందు మానవత్వమును ఏ రీతిగా మనము అర్థము చేసుకోవాలి? మానవాకారము ధరించిన దివ్యత్వముగా మనము భావించాలి.

**మానవత్వములోనున్న దివ్యత్వాన్ని పవిత్రమార్గములో ప్రవేశపెట్టాలి**

దేహము కేవలము పాంచభౌతికమైనది. ఇది భగవంతునియొక్క నివాసము. Body is the Temple of GOD. కానీ యీ టెంపుల్ స్థిరమైనదికాదు moving temple. ఎక్కడ చూచినా భగవంతుడుంటున్నాడు. 'సర్వతఃపాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్...' సర్వత్రా తన పాణిపాదములే ఉంటున్నవి. కనుక మానవత్వములో నున్న దివ్యత్వాన్ని పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. ఇలాంటి పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడే దివ్యత్వముగా మారుతుంది. దేహాత్మభావమే తనను బంధనగావిస్తుంది. పరమాత్మభావమే అతనిని స్వేచ్ఛగా విడిచిపెడుతుంది. మనము ప్రపంచములో ఎంతకాలము జీవించినప్పటికిని దివ్యత్వముగానే జీవించాలి. కొన్ని గుణములు మానవునియందు అమితంగా అభివృద్ధి అవుతుంటాయి. అవి తన బలహీనతలే తప్ప అన్యముకాదు. అనేకమంది అనేక విధములైన దుర్గుణములను అభివృద్ధిపరచుకొని తద్వారా తమయొక్క గొప్పతనము చాటుకునే నిమిత్తమై ప్రవేశపెడుతుంటారు. అదికాదు మానవత్వము. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. నరజన్మము రావటము, పాంచభౌతిక దేహము ఆవిర్భవించటము, ఇవన్నీ దేహకర్మలు అచరించేకోసం. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'. కర్మమార్గములో మనం ప్రవేశపెట్టాలి ఈ శరీరమును. ఏమిటి ఈ ధర్మము? మనోవాక్కాయకర్మలతోకూడినదే ధర్మము. అప్పుడే మానవత్వమనే పేరు

sri sathyasai vacharamrutam

సార్థకమవుతుంది. అదే The proper study of mankind is man. Thoughts, words, action మూడింటి ఏకత్వము కావాలి. ఇది ఈనాడు చాలా దుర్లభముగా ఉంటున్నాది.

**ఈశ్వరుని ప్రకృతితత్త్వము ప్రకటింపచేయడంకొరకే మానవత్వము ఆవిర్భవించింది**

మానవత్వములో ఉన్న యింత పవిత్రతను గుర్తించుకోలేకపోతున్నాము. నిజముగా మానవుడే దేవుడు. నరుడే నారాయణుడు. వ్యక్తిగా భావించినంతవరకు నరుడు. దివ్యత్వమును భావించినప్పుడు నారాయణుడు. ఈ రెండింటి భేదము మన భావములోనే ఇమిడి ఉంటున్నాది. ఇదంతా మన భావముల ప్రమాణమే! ఈ లోకములో మంచిచెడ్డలు ఎదుటివానియందు లేవు. అన్నీ మనయందే ఉంటున్నవి. తన భావములే తనకు ఆ విధమైన మంచిచెడ్డలుగా రూపొందుతుంటాయి. ప్రతి మానవుడు దైవముగా భావించి తానే దివ్యమైన శక్తిగా భావించినప్పుడు జగత్తంతా సుభిక్షంగా ఉంటుంది. ఈశ్వరుని ప్రకృతి తత్త్వమును ప్రకటింపచేయటంకోసమనే మానవత్వము అవిర్భవించింది. ఈ ప్రకృతి స్వభావము అనుభవించే నిమిత్తమే ఈ దేహమునందుకున్నాము. దేహము ఒక పనిముట్టు. మనస్సు ఒక పనిముట్టు. నీవే ఆత్మస్వరూపుడవు. నీవు పనిముట్టును చేతియందుంచుకొని మన కర్మలు, కర్తవ్యములు నిర్వర్తించుకుపోవాలి. 'కర్తవ్యం యోగముచ్యతే'. కర్తవ్యమును ఆచరించే దానిలో మనము చాలా బీదలైపోతున్నాము. బలహీనులైపోతున్నాము. ఈ బలహీనతను మనం దూరం చేయాలి. ఎట్టిదానికి మనము వెరవకూడదు. సత్యాన్ని మనం అనుసరించాలి. ప్రపంచములో దైవము ఎవరంటే సత్యమే దైవము. అట్టి సత్యమును మనము అనుసరించినప్పుడే దైవాన్ని మనం ఆరాధించినవారమవుతాము. సత్యం ప్రతివ్యక్తియందు ఉంటున్నది. కనుకనే మానవత్వములో అన్నీ భగవంతుని శక్తిచేతనే కదలుతున్నవి. లోకములో ఏ పనిచేసేనప్పటికి దైవసంకల్పమే మూలకారణం.

**క్రమము తప్పక మింట ప్రతి రోజు భానుండు**
**ఉదయాస్తమయముల నొందనేల?**
**గగనంబునకు కాంతికైసేయు తారకల్**
**పగలుమాత్రము దాగు భంగియేల?**

srisathyasaivachanamrutam

**క్షణమైన విశ్రాంతి గనక తా పవనుండు**
**జీవకోటుల బ్రోవ వీవనేల?**
**అనిశంబు కలకల ధ్వనులతో నదులును**
**సలిలమై ప్రవహించు చందమేల?**
**ప్రకృతిలో నెందు జూచిన ప్రజలయందు**
**ధనవిభవమతి జాతిభేదంబు లేల?**
**ఎవరి యాజ్ఞకు బద్ధులో ఎవరు ప్రభువొ**
**ఎవరి యానతి యిదియెల్ల ఇట్లు జరుగు**
**అతడె ఇతడని, ఇతడె అతడని**
**సర్వుల కధిపతియని కాంచరయ్య**

అంతా దైవాజ్ఞయే! ఏ చిన్న కార్యమైనా దైవాజ్ఞయే దీనికి మూలకారణము. 'కదలదు నీదు సంకల్పములేనిదె గడ్డి పోచయును'. మంచిచెడ్డలు నీ భావముయొక్క ప్రభావములేగానీ దైవములో అంతా మంచిదే! సమత్వము భారతీయ సంస్కృతి. ప్రాచీనకాలమునుండి ఇట్టి పవిత్రమైన ఉపదేశములనందిస్తూ వచ్చింది. అందరూ ఒక్కటే! భారతీయ సంస్కృతియందు వేదము ప్రమాణము. అదే ప్రాణము. 'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్' అనంతశిరములచేత అనంత పాదములచేత అనంతహస్తములచేత అనంతనేత్రములచేత జగత్తు నిండి ఉంటున్నది. కనుక మనము 'సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై....' అందరు కలిసిమెలసి ఉండాలి. దానికే

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలిమిచెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**

ఇది వేదముయొక్క ప్రధాన బోధ. అందరు కలసిమెలసి ఉండాలి. ఐకమత్యమే మానవజీవితము. ఆచరణే అభివృద్ధికి మూలకారణము. కానీ యీనాడు

srisathyasaivachanamrutam

ఐకమత్యములేదు. ఈ ఐకమత్యము కోల్పోవటంచేత మానవత్వము ఛిన్నాభిన్నమైపోతున్నాది. కనుక unity ని పెంచుకున్నప్పుడు మనలో purity develop అవుతుంది. Purity develop అయినప్పుడే Divinity మనకు ప్రాప్తిస్తుంది. ఏనాడు unity లేదో ఆ ప్రదేశములో enimity లేక community ఈ రెండింటిలో ఏదో ఒకటి చేరిపోతుంది.

**భారతదేశము ప్రపంచ దేశములన్నిటికి ఉపాధ్యాయస్థానములో నున్నది**

మానవునికి ముగ్గురు శత్రువులు చాలా ప్రధానము. అవే కామక్రోధద్వేషములు. అవి మహా రాక్షస గుణములు. వీటిని ఏమాత్రము చెంత చేర్చకూడదు. మానవుని ప్రధానమైన గుణము ప్రేమయే. Love is GOD. Live in LOVE. ఆ ప్రేమతత్త్వమును మనము ఈనాడు పెంచుకోవాలి. దేనినైనా మనము విసర్జించవచ్చును, ప్రేమను మాత్రము విసర్జించకూడదు. ప్రేమయే మన ప్రాణము. ప్రేమయే మన జీవితము. ప్రేమయే ఈ ప్రపంచము. ప్రేమయే దైవము. కనుక 'విశ్వం విష్ణు స్వరూపం'. విష్ణువనగా వ్యాపకత్వమైనవాడు. అట్టి వ్యాపకత్వమైన ఈ జగత్తునందు దైవత్వము లేనిది ఏమిటి? ఉంటే చూపమని అడుగుతారు. చూపేది దేనిని? అంతా దైవమే! 'పశ్యన్నపిచ నపశ్యతి మూఢో' చూస్తున్నదంతా దైవమే. ఇంక దైవాన్ని చూపమని ఏమిటి అడగటం! దైవమంటే ఏమి రూపము? ఈ దైవమునకు అన్ని రూపములు తనవే! అన్ని భావములు తనవే! చూచినవన్నీ దైవ స్వరూపమే! ఇందులో మంచిచెడ్డలనే భేదములేదు. కాలమార్పుచేత మంచిచెడ్డలుగా రూపొందుతున్నాయి. సాయంకాలం ఫలము తిన్నాము. తెల్లవారేటప్పటికి మలమవుతుంది. ఫలము good అంటున్నాము. మలము bad అంటున్నాము. Good, bad లు నీ దృష్టిలోనేగాని దైవములో రెండూ సమానమే! కాలమార్పుచేతనే ఈ విధమైనవి జరుగుతున్నాయి. Time is everything. కాలము చాలా ప్రధానము. ఇట్టి విశాలమైన దైవత్వమును నిరూపించినది దైవత్వము. India is the teacher of all lands అన్నారు. అన్ని దేశములకు భారతదేశము ఉపాధ్యాయస్థానములో ఉన్నటువంటిది. దివ్యత్వమును ఏ భేదములేకుండా ఒక్కటిగా భావించినది. దైవము ఒక్కడే, గమ్యము ఒక్కటే, జీవితము ఒక్కటే! ఈ ఏకత్వములోనే అనేకత్వము వ్యాప్తి చెందింది. 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి' అట్టి దివ్యత్వమును మనము అనేకత్వముగా

srisathyasaivachanamrutam

బోధిస్తున్నాము.

**మానవత్వమంటే ఆకారమానవత్వము కాదు, ఆచారమానవత్వము**

ప్రేమస్వరూపులారా! నేటి పరిస్థితిలో ముఖ్యంగా కావలిసినది ప్రేమయే! ఈ ప్రేమను కోల్పోవటంచేత మానవత్వమునే కోల్పోయినాము. ఏమిటి మానవతా విలువలు? మన ప్రేమయే మానవతా విలువ. మన సత్యమే మానవతా విలువ. అహింసయే మానవతా విలువ. మన ధర్మమే మానవతా విలువ. ఇట్టి విలువలు మనయందుంచుకొని విలువలు లేనట్టుగా కేవలము మూర్ఖుడై ప్రవర్తిస్తున్నాడు. మానవత్వమంటె ఆకార మానవత్వముకాదు. ఆచార మానవత్వము కావాలి. ఆకారముండినంతమాత్రమున ప్రయోజనమేమిటి? ఆకుపచ్చ పక్షులన్ని చిలుకవలె పలుకునా?

**పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా!**
**ఏనుగంత బలసియున్న పంది ఏనుగు అగునటయ్యా!**

కాదుకాదు. మానవత్వము ఒక్క రూపాన్ని బట్టికాదు. కానీ, మానవుడు మానవ జీవితములో ఉండికూడను దివ్యత్వమును తాను గుర్తించుకోలేకపోతున్నాడు.

**పూవులోని మకరందము తీగలనుభవించునా!**
**పండ్లలోని మధుర రసము వృక్షము అనుభవించునా!**

ఈ లోకములో సర్వము త్యాగముగానే ఉంటున్నాది. నదులు ప్రవహిస్తున్నాయి. తన జలమును తాను త్రాగటంలేదు. ఆ జలమును పరోపకార నిమిత్తము పంచుతున్నాయి. వృక్షములు ఫలములందిస్తున్నాయి. కానీ ఆ వృక్షములు ఆ ఫలములను భుజించటంలేదు. ఆ ఫలములను అందరికి అందిస్తున్నాయి. గోవులున్నాయి. గోవులు తమ క్షీరమును తాము త్రాగటంలేదు. తమ క్షీరమును పదిమందికి పంచుతున్నాయి. అదే విధముగా మానవత్వములోని దివ్యత్వమును పదిమందికి పంచాలి.

**చెడ్డవారితో మంచివాడు కలిసినప్పుడు మంచివాని విలువపోతుంది**

ఈనాటి మానవుడు స్వార్థము, స్వప్రయోజనములతో జీవిస్తున్నాడు. పశువులైనా తమ

srisathyasaivachanamrutam

క్షీరమును పదిమందికి పంచుతున్నాయి. కానీ, యీనాటి మానవునియందు విశాలమైన భావము క్షీణించింది. సంకుచితమైన భావములు పెరిగిపోయినాయి. ప్రతిదానికి స్వార్థము, స్వార్థము. స్వార్థము మితి మీరిపోవటంచేత మతి తప్పిపోతున్నది. ఈనాటి చదువులందు మంచితనములేదు. ఎంతమంది విద్యావంతులు లేరు, లోకములో! ఎంతమంది గొప్ప మేధావులు లేరు! ఎంతమంది వైజ్ఞానికులు లేరు! ఎంతమంది నోబెల్ ప్రైజును తీసుకున్నవారు లేరు! కానీ వీరి పేర్లంతా ఎక్కడున్నాయి? కేవలము కొన్ని గ్రంథాలలో నిల్చిపోయినాయి. కానీ రామకృష్ణ పరమహంస, రామదాసు, కబీర్‌దాసు వంటి మహనీయుల పేర్లు మానవుల హృదయాల్లో నిల్చిపోయినాయి. కాని, ప్రాకృత విద్యలు నేర్చిన వారి పేర్లు కేవలం గ్రంథాల్లో మాత్రమే నిలుస్తాయి. మన పేర్లు గ్రంథాలలో నిల్చనక్కరలేదు. ప్రజల హృదయాల్లో నిల్చిపోవాలి. అలా నిల్చిపోవటానికి ఏమైనా మంచి కార్యములు చేయాలి. 'త్యజ దుర్జన సంసర్గం' చెడ్డవారి కంపెని మనం పట్టకూడదు. కారణం ఏమిటి? ఆ చెడ్డ అంతా మనలో ప్రవేశిస్తుంది. Tell me your company, I shall tell you what you are. చెడ్డవారితో సహవాసము చేయకూడదు. నీకు చేతనైతే చెడ్డవారిని మార్చటానికి ప్రయత్నం చేయి. కనుక 'త్యజ దుర్జన సంసర్గం'. అది చేసినంతమాత్రమున చాలదు. 'భజ సాధు సమాగమం'. మంచివారితో స్నేహము చేయాలి. మంచివారితో స్నేహము చేసినప్పుడే మనము మంచిస్థాయికి పోతుంటాము. మహాత్యాగి, మహాశక్తివంతుడు, మహాగుణవంతుడు, మహాబలవంతుడు అయినప్పటికి దుష్ట సహవాసముతో దుర్యోధన దుశ్శాసన శకుని సహవాసముచే దుష్టచతుష్టయములో ఒకడై పోయాడు, కర్ణుడు. పదిశేర్లలోపల ఒకశేరు నీరు కలుపుతే వీటికికూడా పాల విలువ వస్తుంది. విలువలేని నీటికి విలువనందిస్తుంది పాలు. పదిశేర్లనీటిలో ఒకశేరు పాలు కలిపితే పాలు విలువ పోతుంది. చెడ్డవారితో మంచివాడు కలిసినప్పుడు మంచివాని విలువపోతుంది.

**ఆత్మకు సమీపముగా పోయేదే పరోపకారము**

మంచివారితో మనంకూడాలి. మంచివారితో చేరాలి. దీనిని పురస్కరించుకొనియే

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః**

అన్నారు. సత్సంగముకావాలి. తద్వారా సద్భావములు, సద్గుణములు, సదాలోచనలు, సత్కర్మలు, సచ్చింతనలు మనలో ప్రారంభమవుతాయి. కనుకనే 'భజ సాధు సమాగమం' మంచివారితో మనం చేరాలి. మూడవది ఏమిటి? 'కురు పుణ్య మహోరాత్రం' నిరంతరము పుణ్యము చేస్తూరావాలి. ఏమిటి ఈ పుణ్యమంటే? పరోపకారసంబంధమైన పుణ్యమా? లేక దాన ధర్మములా? ఇవి ప్రాకృతమైన పుణ్యములే! కానీ నిజమైన పుణ్యము ఏమిటి? పరోపకారము. పర అనగా ఉపకర. పర-ఆత్మ. ఉప-సమీపము, కర-పో. ఆత్మకు సమీపముగా పోయేదే పరోపకారము. అదే నిజమైన పరోపకారం. 'కురు పుణ్య మహోరాత్రం' నిరంతరం దైవముతో ఉండు. Live with GOD. Be with GOD. Do with GOD. See with GOD. Think with GOD. అంతా దైవముతోనే ఉంటున్నది. సర్వము దైవభావముతోనే ఉంటుండాలి. ఇది నిజమైన పరోపకారము. రాత్రింబవలు ఏ పని చేసినప్పటికిని దైవచింతన చేయాలి. ఈ మంచికార్యము దైవకార్యముగా మారుతుంది. అట్టి పవిత్రభావాలతో మనము జీవితాన్ని గడపాలి. ఇంక నాల్గవది ఏమిటి? మానవత్వములో నిత్య జీవితములో ఉండవలసినది మానవుడు అనుభవించటంలేదు ఆచరించటంలేదు. 'నిత్యమనిత్యతాం' ఏది నిత్యము ఏది అనిత్యము అనేది తెలుసుకోవాలి. ఏది శాశ్వతము? ఇవన్నీ కేవలము గాలితో చేరిన మేఘములే. మన సుఖము, దుఃఖము, ఆనందము, సంతోషము అన్నీ కదలిపోయే మేఘములే! ఇన్ని మేఘములు కదలినా సూర్యుడు చక్కగానే ఉంటాడు. అదే మన బుద్ధిని మారకుండా చూచుకోవాలి.

**ఏ పని చేసినా దైవకార్యముగా భావించాలి**

బుద్ధివల్లనే మానవత్వము దివ్యత్వముగా మారుతుంది. అతనిని బుద్ధిమంతుడు అంటారు. ఆ బుద్ధి మాత్రము గడ్డి తినకుండా చూచుకోవాలి. మనసు మారినా పరవాలేదు. Mind is a mad monkey, body is like a water bubble. Don't follow the body, don't follow the mind, follow the conscience. అదే బుద్ధియొక్క తత్త్వము. దానిని మనం అనుసరించాలి.

sri sathyasaivachanamrutam

అట్టి దానిని మనము అనుసరించినప్పుడే సక్రమమైన దానిలో మనము ప్రవేశిస్తాము. ప్రతి దానికి మన బుద్ధే మనకు సాక్ష్యము. మన బుద్ధి పవిత్రముగా, నిర్మలంగా, నిశ్చలంగా, నిస్వార్థంగా ఉండినప్పుడే దేనికి మనం భయపడనక్కరలేదు. ఎక్కడ భయము వస్తుంది దోషముండినప్పుడే భయము వస్తుంది. దోషములేని దగ్గర భయమునకు అవకాశముండదు. ఏ పనిచేసినా దైవకార్యముగా భావించాలి. నా పని, నీ పనికాదు. అందరు దైవముయొక్క బిడ్డలే! దైవశక్తికి నీవు ఒక ట్రస్టీగా ఉండవలసిందే! ఏమాత్రము దుర్వినియోగము చేయకూడదు. మనము ఈ దేహాన్ని సద్వినియోగము చేయాలి. మన మాటలను సద్వినియోగము చేయాలి. ఈ దైవత్వమునకు మార్గము ఎక్కడుంటున్నాది?

See no evil, see what is good,
Talk no evil, talk what is good
Hear no evil, hear what is good
Think no evil, think what is good
Do no evil, do what is good
This is the way to GOD.

ఇంత సులభంగా ఉన్న దైవమార్గమును అనుసరించే నిమిత్తము ఏదో తపస్సులు చేయటం, ధ్యానములు చేయటం, యోగములు చేయటం అన్నీ కాలమును వ్యర్థము చేయటమే! ముఖ్యంగా 'తోటి మానవునకు ఏ విధంగా సహాయము చేయాలి?' అని ఆలోచించాలి.

**దయగలవాడే మానవుడు**

ప్రేమస్వరూపులారా! సహాయము అంటే ఏమిటి? ఒక చిన్న ఉదాహరణ. మీరంతాకూడా బస్సులో వస్తుంటారు. ట్రైనులో వస్తుంటారు. ఇంకేదైనా వాహనాలలో వస్తుంటారు. అయితే ట్రైనులో వచ్చే సమయంలోనో, బస్సులో వచ్చే సమయంలోనో ఏ విధంగా సహాయం చేయటం? ఆ బస్సులో వృద్ధులో లేక స్త్రీలో సీటు చిక్కక నిల్చుని వుంటారు. అలాంటి సమయంలో నీ సీటునుండి లేచి వారికి ఆ సీటు యిచ్చేయి. చిన్న పిల్లలుంటారు. వారికి సీటు దొరకక వుంటారు. వాళ్ళకి నీ సీటు యిచ్చి నీవు లేచి నిలుచో! ఇలాంటి సహాయాలు ఎన్ని అయినా చేయవచ్చు. జీవితములో ఈనాడు నిజంగా యువకులు



srisathyasaivachanamrutam

చేయవలసిన సేవ యిది. బస్సులో కూర్చుంటారు. ఇంకా రెండు సీట్లనాక్రమించుకుంటారు. స్త్రీలో, వృద్ధులో ఎవరైన నిల్చుని బాధపడుతూవుంటే, వీరు కూర్చుని నవ్వుకుంటూ వుంటారు. ఈనాటి మానవుని గుణములంతా యీ విధంగా వుంటున్నాయి. సినిమాలో కష్టపడే వానిని చూస్తే కంటినీరు కార్చుతుంటారు. సినిమాచూసి వెక్కివెక్కి ఏడుస్తారు. ప్రత్యక్షంగా బాధపడ్తున్నవానిని వెక్కిరిస్తారు. ఇదా మానవత్వ లక్షణము? ఇది కాదు. ఎక్కడైనా దయ దయనే! అందరియందూ మనం compassion చూపాలి. ఈ compassion లేకుండా పోవటం ఒక fashion అయిపోయింది. మనకు fashion కాదు compassion కావాలి. ఈ విధమైన దానిని kind అన్నారు. Mankind అన్నారు. ఈనాడు man ఉన్నాడు కాని kindness లేదు. Man అంటే ఎవరు? Kindness వున్నవాడే man. అందువల్లనే mankind అన్నారు. ఈనాడు kindness లేదు. అందువల్లనే ఆ కరుణను యీనాడు మీరందరు అభివృద్ధిపరచుకోవాలి. ఆ దయను యీనాడు పెంచుకోవాలి. ఇదియే మన జీవితానికి మంగళకరమైనటువంటిది. విద్యార్థులున్నారు. ఎక్కడైనా, ఎవరైనా కొంచెం అశాంతిగా బాధలు పడుతుంటారు. అట్టివారికి తగిన సహాయము చెయ్యాలి.

**దైవమే నిజమైన మానవునికొరకు అన్వేషిస్తున్నాడు**

అందరూకూడా మేము దేవుడిని వెతుకుతున్నాము, దేవుడిని వెతుకుతున్నామంటారు. దేవుడిని వెతకటంలేదు. నిజంగా దైవాన్వేషణ ఎక్కడా జరగటంలేదు. దైవమే నిజమైన మానవునికొరకు అన్వేషణ జరుపుతున్నాడు. దైవమే వెతుకుతున్నాడు, మంచివాడెవడని. 'ఎక్కడున్నాడు మంచివాడు?', అని వెతుకుతున్నాడు. నిక్కమైన, చక్కనైన, మక్కువైన మానవుడెవరు? ఈనాటి మానవుడు లోపల ఒకటి, బయట మరొకటిగా వుంటున్నాడు. కనుక ఎవరు మంచివారు? ఎవరు చెడ్డవారు? లోపల, బయట ఒక్కటిగానే వుండాలి. ఈనాటి మానవుని పొజిషన్ ఎలావుంది? దుఃఖం వస్తే ఏడుస్తాడు, నవ్వు వస్తే ఏడుస్తాడు. ఇవన్నీ ప్రాకృతమైన లక్షణాలు. ఇలాంటి వికారతత్వంతోకూడిన మానవునికి దివ్యమైన ఆత్మతత్వం ఏరీతిగా లభ్యమవుతుంది? 'అంతర్బహిశ్చతత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః' లోపల బయట ఒకలాగానే ఉండాలి. అట్టి మానవునికోసమై భగవంతుడు వెతుకుతున్నాడు.

కనుక మనమందరము అట్టి మానవులుగా తయారుకావాలి. లోపల బయట ఒకటిగానే ఉంటుండాలి. అప్పుడే మన నిమిత్తమై భగవంతుడు వెతుకుతూ వస్తాడు. మనం భగవంతుని వెతకటంకాదు. ఎందుకోసం మనం వెతుకుతున్నాము? మనలో ఆ పవిత్రత లేకపోవటంచేత వెతుకుతున్నాము. మనలో ఆ దాహము లేకపోవటంచేత వీటికోసం వెతుకుతున్నాము. మనలో అట్టి కరుణలేక ఆ కరుణాస్వరూపుని వెతుకుతున్నాము. నిజంగా మనలోనే ఆ కరుణ ఉంటే కరుణాస్వరూపుడు వెంటనే, ఇంటనే, జంటనే, కంటనే ఉన్నాడు. నిజంగా తన దగ్గర ఉన్నదానిని బయట వెతుకుతాడా? తన దగ్గర లేనిదానినే బయట వెతుకుతాడు. దైవమును బయట వెతుకుతున్నాడు. తనయందే ఉంటున్నాడు, భగవంతుడు. In you, with you, above you, below you, around you. You are GOD ఆ భావము పెట్టుకోవాలి. నీవే దైవము. అప్పుడు 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి'. దేహాన్ని లక్ష్యములో పెట్టుకోవద్దు. దేహము ఒక instrument, mind instrument, senses instrument. నీవు Master. అలాంటి స్థితికి మనం పోవాలి. ఆనాడే నిజమైన శివతత్త్వము. శివమనగా మంగళము. ఆ మంగళము మనలో లేదు కనుక నిరంతరము అమంగళముతో ఉంటున్నాము. నిజంగా ఆ మంగళము తనయందే ఉంచుకున్నవాడు బయట ఎందుకు వెదకాలి? ముక్కుపై అద్దాలు పెట్టుకొని ఇల్లంతా వెతుకుతారు కొంతమంది. అద్దము దగ్గరకుపోయి 'అయ్యో! నా అద్దాలు ముక్కుపైననే ఉన్నాయే' అని అప్పుడు తెలుసుకుంటారు.

**అన్నదమ్ములు ఐకమత్యంగా, అన్యోన్యంగా ఉండాలి**

అందరూ సోదరత్వంగా భావించాలి. చిన్న ఉదాహరణము. ఒకానొక సమయములో రాముడు, భరతుడు, లక్ష్మణుడు బంతి ఆట ఆడుతూ వచ్చారు. ఆడి ఆడి అలసిపోయి చెమటకారుస్తూ రాముడు కౌసల్య ఒడిలో వచ్చి కూర్చున్నాడు. కూర్చున్న రాముడు చాలా ఆనందముగా నవ్వుతున్నాడు. కౌసల్య అడిగింది 'ఇంత శ్రమపడి వచ్చావు. ఏమిటి నీ ఆనందమునకు కారణము?' అమ్మా! 'ఈనాడు మేము బంతి ఆట ఆడుకున్నాము. ఈనాడు భరతుడు గెల్చాడు. అదే నాకు చాలా సంతోషము' అన్నాడు. 'ఓహో! తమ్ముడు గెల్చాడని

sri sathyasai vachanamrutam

అన్నకు ఇంత ఆనందమా? ఇలాంటి అన్నదమ్ములు ఉంటుండాలి'. కొంతసేపు అయిన తరువాత భరతుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. చాలా విచారంగా వచ్చాడు. కౌసల్య అడిగింది, 'నాయనా! గెల్చినందుకు ఆనందముగా ఉండాలిగానీ ఎందుకు విచారం? కారణం ఏమిటి?' అని. అమ్మా! 'నేను ఓడిపోయే పరిస్థితిలోపల నన్ను గెలిపించాలని అన్న ఓడి గెలుపు నాకందించాడు. అన్న ఓడినాడే అని నాకు చాలా కష్టంగా ఉంటున్నాది. నా నిమిత్తమై అన్న ఓడిపోటం చాలా విచారం కాదా!' అన్నాడు భరతుడు. తమ్ముడు గెలిస్తే అన్న ఆనందించాలి. తమ్ముని నిమిత్తమై అన్న ఓడిపోయినా పరవాలేదు. తమ్ముణ్ణి గెలిపించాలి. ఇదీ రామాయణములో ఆదర్శ విషయాలు. కానీ ఈనాడు అన్నదమ్ములు ఆవిధంగాలేరు. ఆనాడు రామలక్ష్మణులు అన్మదమ్ములు Supreme state లో వున్నారు. ఈనాటి అన్నదమ్ములు Supreme court కు వెడుతున్నారు. అదికాదు. మనం Supreme state కి పోవాలి. అన్నదమ్ములు ఐకమత్యంగా ఉంటుండాలి. అన్యోన్యంగా ఉంటుండాలి. అనుకూలంగా ఉంటుండాలి, adjustment and understanding ఉంటుండాలి. ఈనాడు adjustment and understanding ఎక్కడా కనిపించటంలేదు. ఆనాటి రామాయణమునందు ఇలాంటి ఆదర్శాలు ఎన్నో ఉంటున్నాయి. తమ్ముడు గెలిస్తే అన్న ఆనందించేవాడు, అన్న ఓడితే తమ్ముడు దుఃఖపడేవాడు. ఇలాంటి ప్రేమతత్త్వము తిరిగి అభివృద్ధి కావాలి.

**అందరియందున్న చైతన్యమే నీయందుకూడా ఉన్నది**

విద్యార్థులారా! విద్యార్థినులారా! అందరూ ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. ఈనాడు శివరాత్రి. అనగా ఏమిటి? మంగళకరమైన గుణము పెంచుకోవాలి. 'లోకాః స్సమస్తా సుఖినోభవంతు' అందరు సుఖముగా ఉంటుండాలి. నేను మాత్రమే సుఖంగా వుండాలనుకోకూడదు. అందరూ సుఖంగా ఉండాలి. ప్రతి మానవుడు సంఘములో మెంబరేగానీ సంఘమునకు అతీతుడుకాడు. సమిష్టి స్వరూపుడు, ప్రతి మానవుడు. సమాజములేక వ్యష్టి ఎక్కడ? ప్రతి వ్యక్తి సమిష్టిస్వరూపుడే. సమాజముయొక్క సంక్షేమాన్ని మనం కోరాలి. నీ స్వార్థముకోసం నీవు పాటుపడకూడదు. అలాంటివి ఈ విద్యార్థులలో అధికంగా పెరగాలి. ఎక్కడ నీవు ప్రయాణం చేస్తున్నప్పటికి ఎవరైనా బాధపడుతుంటే ఆ

sri sathyasaivachanamrutam

బాధ మీరు వహించి మీరు సహాయం చేయాలి. Brotherhood of man and fatherhood of God. ఇలాంటి పవిత్ర భావాలు మనం పెంచుకున్నప్పుడే నిజంగా మనం విద్యావంతులమవుతాము. సహాయము చాలా అవసరము. తోటి మానవునియందున్న దైవత్వమును చక్కగా మనం అర్థము చేసుకోవాలి. 'ఈశ్వర స్సర్వభూతానాం' అన్నారు. అందరియందున్న చైతన్యమే నీయందు ఉన్నది. ప్రతి మానవుని మనం గౌరవించాలి. సేవించాలి. సన్నిహిత సంబంధబాంధవ్యము పెంచుకోవాలి. ఇదే నిజమైన మానవత్వము. అట్లుకాక నీటిపై తైలపుబొట్టువలె నీరు వేరు, తైలము వేరుగా ఉండకూడదు. ఏకమై పోవాలి. ఇలాంటి తుచ్ఛభావాలు ఉంచుకోకూడదు. ఈనాటి మానవునకు కోరిక ఫలించెనా చాలా ఆనందము. విఫలమైన ద్వేషము. దైవాన్నికూడా ద్వేషించేవారున్నారు. అయితే ఈ దైవమును ద్వేషించేవారు మూడురకములు. ఎవరు? దైవము అంటేనే నమ్మకము లేనివారు ఒకరు. మనోభీష్టములు విఫలమైనప్పుడు ద్వేషించేవారు మరొకరు. వ్యక్తిగత ద్వేషమువారు మూడవవారు. ఈ మూడు రకములైన వారు తప్ప, మిగతా ఎవరూ దైవమును ద్వేషించరు. అందరిని ప్రేమించాలి. దైవమును ప్రేమతోనే సాధించాలి. ద్వేషముతో భగవంతుడు మనకు చిక్కడు. అసూయ, అహంకారములతో అంతకంటే చిక్కడు. ప్రేమ, ప్రేమ, ప్రేమ. ఈ ప్రేమతోనే మనము ప్రపంచములో జీవించాలి.

**(తేదీ 17-02-1996న పూర్ణచంద్ర సభామంటపములో శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam